సాక్షి రంగారెడ్డి

బుధవారం । 2 । జూలై । 2025



ఖర్చుకు వెనుకాడొద్దు

ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించే బాధ్యత తనదని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



సిగ్గుపడాల్సింది పోయి..

ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాల్సిందిపోయి దాడులు చేస్తామనడం సిగ్గుచేటని మంత్రి జూపల్లి అన్నారు. 8లో▸



మహేశ్వరంలో 'మలబార్'

మహేశ్వరం మండల పరిధిలోని కేసీ తండా ఎలక్ట్రానిక్ పార్కులో మరో భారీ పరిశ్రమ రూపుదిద్దుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

ముగ్గురు బాలకార్మికులకు విముక్తి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రైవేటు పరిశ్రమల్లో పని చేస్తున్న ముగ్గురు బాల కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. ఆపరేషన్ ముస్కాన్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. తుర్కయంజాల్ సమీపంలోని పలు పరిశ్రమల్లో పని చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని హోంకు తరలించారు. యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మున్సిపల్ కార్మికులతో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రు నాయక్ పిలుపునిచ్చారు. తుర్కయంజాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రమేష్, బాల నరసింహ, అనిత, శోభ, సునీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంకు ఎంపిక



హెచ్‌ఎం జంగయ్యకు ధ్రువపత్రం అందిస్తున్న సీజీఆర్ కోఆర్డినేటర్ రజనీకాంత్

కడ్తాల్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం సీజీఆర్ సంస్థ కోఆర్డినేటర్ రజనీకాంత్ పాఠశాలను సందర్శించి బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలను హెచ్‌ఎం జంగయ్యను అడిగి నమోదు చేసుకున్నారు. పాఠశాలలో హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, డిక్లేర్ నో ప్లాస్టిక్ జోన్, డిక్లరేషన్ ఆఫ్ మదర్ ట్రీ, కిచెన్ గార్డెన్, సాయిల్ అండ్ సీడ్ మ్యూజియం, మెడిసినల్ గార్డెన్, రెన్యూవల్ ఎనర్జీ సోలార్, ప్లాంటేషన్, ప్రిపరేషన్ ఆఫ్ విలేజ్ జియోగ్రఫీ, మ్యాపు అండ్ రిపోర్టు, ప్లాంటేషన్ వంటి కార్యక్రమాల నిర్వహణకు తోడ్పడుతున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతోనే తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న రఘు నాయక్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతోనే తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో అధిక శాతం తెలంగాణ నుంచి వెళ్తున్నాయని, బడ్జెట్‌లో మాత్రం మొండిచెయ్యి చూపిస్తోందని విమర్శించారు. మెట్రో, ఆర్ఆర్ఆర్, మూసీనదీ ప్రక్షాళన, తదితర అభివృద్ధి పనులకు సరైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ విచ్చేస్తున్నారని, ఇందులో భాగంగా గ్రామస్థాయి నేతలతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, వీరేశం, రాజు, నర్సింలు, సుదర్శన్‌గౌడ్, బాల్‌రాజుగౌడ్, ఇబ్రహీం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం



మొయినాబాద్‌లోని స్టార్ కాలనీలో అంతర్గత రోడ్డు పరిస్థితి

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలో అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. మున్సిపల్ కేంద్రంలోని స్టార్ కాలనీ, ముస్తఫా హిల్స్ కాలనీ, భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, విజయనగర్ కాలనీల్లో అంతర్గత రోడ్లు సరిగా లేవు. మురుగునీరు రోడ్లపై పారడంతో గుంతలమయంగా మారి నడవలేని పరిస్థితి నెలకొంది. చిన్నషాపూర్, పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, ముర్తాజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్ గ్రామాలకు వెళ్లే రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు సైతం దెబ్బతిన్నాయి. వర్షాలు పడినప్పుడు రోడ్లపై గుంతల్లో వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. స్థానిక ప్రజలతోపాటు ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వీధిదీపాల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. కొన్నిచోట్ల గతంలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు ఉన్నప్పటికీ అందులో కొన్ని చెడిపోయాయి. వాటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కొన్నేళ్లుగా వెలగడంలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొంటోంది.

రోడ్లు లైట్లు అస్తవ్యస్తం

సాక్షి ఫోకస్

మున్సిపాలిటీల్లో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. గుంతలు తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. వర్షం కురిస్తే బురదమయంగా మారి నడవలేని పరిస్థితి నెలకొంది. ఇక వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. చాలా చోట్ల రాత్రివేళ వెలగడం లేదు. మరికొన్ని చోట్ల పట్టపగలే వెలుగుతున్నా పట్టించుకునేవారే లేరు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

- గుంతలు తేలి ప్రయాణానికి ఆటంకం
- వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం
- రాత్రివేళ అంధకారంలో కాలనీలు
- మరికొన్ని చోట్ల పట్టపగలే వెలుగులు

పట్టపగలే వెలుగులు.. పట్టని అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ గాలికొదిలేశారు. మున్సిపల్ పరిధిలోని సాహెద్‌గూడ, అంతఃపురం కాలనీ, మెట్రోసిటీ, మైహోమ్స్ కాలనీల్లో పట్టపగలే లైట్లు వెలుగుతున్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో నిత్యం అదే పరిస్థితి. మంగళ్‌పల్లి, ఆదిబట్ల, బొంగ్లూర్, కొంగరకలాన్ ప్రాంతాల్లో రోడ్లు లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త రోడ్లకు మోక్షం కలగడం లేదు.



అంతఃపురం కాలనీలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

☛ మరమ్మతులు కరువు



రావిర్యాలలో ప్రమాదకరంగా రోడ్డు

తుక్కుగూడ: మున్సిపల్ కేంద్రంతో పాటు పలు గ్రామాలు, కాలనీలకు వెళ్లే రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పూర్తిగా దెబ్బతిని గుంతలుగా మారాయి. పాదచారులు, వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

☛ మట్టిరోడ్లే దిక్కు.. పట్టని వీధి దీపాలు



ప్రశాంత్‌నగర్ కాలనీలో మట్టి రోడ్డు

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా ఏర్పడిన పలు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నా సీసీ రోడ్లు లేకపోవడంతో యజమానులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న మట్టిరోడ్లు వర్షాలకు దెబ్బతిని గుంతలు తేలడంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. శివారులో ఉన్న చాలా కాలనీల్లో వీధిదీపాలు సరిగా లేక రాత్రి సమయాల్లో అంధకారంలో మగ్గాల్సి వస్తోంది. రాత్రిళ్లు మహిళలు ఒంటరిగా బయటికి రావడానికి జంకుతున్నారు. వీధిదీపాల నిర్వహణ ఏజెన్సీకి అప్పగించారు. ఏజెన్సీ వారికి మున్సిపాలిటీ లక్షల్లో బాకీ ఉండటంతో పట్టించుకోవడం లేదు.

వేధిస్తున్న నిధుల కొరత

చేవెళ్ల: వార్డులు, కాలనీలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. గతంలో వేసిన సీసీ రోడ్లు గుంతలు తేలడంతో వర్షానికి నీళ్లు నిలిచి ప్రజలకు ఇబ్బందిగా మారింది. నిధుల కొరత కారణంగా వీధి దీపాల ఏర్పాటు సరిగా లేకపోవటంతో రాత్రి వేళ కాలనీలు, వార్డుల్లో అంధకారం తప్పడం లేదు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో ఇప్పటి వరకు నిధులు రాలేదు. ప్రధాన సమస్యలు ఎక్కడివక్కడే అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు.



రంగారెడ్డి కాలనీలో గుంతలమయంగా మారిన సీసీ రోడ్డు

☛ నిర్వహణ లోపం.. వెలగని వీధి దీపం



మార్కెట్ యార్డు వెనుక వీధిలో వెలగని లైట్లు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో 4,313 వీధి దీపాలు ఉండగా సెంట్రల్ లైటింగ్ 650, హైమాస్ట్ లైట్లు 20 ఉన్నాయి. నిర్వహణ లోపంతో తరచూ వీధిలైట్లకు అంతరాయం కలుగుతోంది. శ్రీ ఇందు కళాశాల నుంచి ఇబ్రహీంపట్నం వరకు ప్రధాన రహదారిపై అమర్చిన సెంట్రల్ లైటింగ్ పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఎప్పుడు లైట్లు వస్తాయో, పోతాయో తెలియని పరిస్థితి. తరచూ లైట్లు, వైర్లు ఖాళీపోయి, చెడిపోతుండటంతో రాత్రివేళ ఆ రహదారిలో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డు వెనుక ఉన్న పలు కాలనీలతోపాటు కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేక వీధిలైట్లను అమర్చడం లేదు. ఆయా కాలనీల్లో రాత్రి వేళ అంధకారం అలముకుంటోంది.

☛ ఏడేళ్లయినా రోడ్లే లేవు.. లైట్లే వెలగవు



సింగాపురంలో అసంపూర్తిగా రోడ్డు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ ఏర్పడి ఏడేళ్లు పూర్తి కావస్తున్నా పట్టణంలోని కొన్ని కాలనీలకు సరైన రోడ్లు లేవు. వర్షాకాలంలో స్థానికులు పడే బాధ వర్ణనాతీతం. ఇప్పటికే పలువురు కమిషనర్లకు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం రూ. 4కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో సింగాపురం, రిత్విక్ వెంచర్, చిన్న శంకర్‌పల్లి, సాయినగర్ కాలనీ, ఫత్తేపూర్‌లో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. బుల్కాపూర్, కొత్తగా ఏర్పాటైన బ్లూవుడ్స్ కాలనీ, రెడ్డి కాలనీ, మైనార్టీ కాలనీ, ఆదర్శ నగర్ కాలనీ, ఎస్ఎం గార్డెన్స్ ప్రాంతాల్లో మరిన్ని రోడ్లు వేయాల్సి ఉంది. మున్సిపల్ పరిధిలో చాలావరకు వీధి లైట్లు వెలగడం లేదు. శంకర్‌పల్లి చౌరస్తా నుంచి బుల్కాపూర్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ని వివరణ కోరగా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

జిల్లా నేతలతో పీసీసీ చీఫ్ భేటీ



జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎల్బీ స్టేడియం వేదికగా ఈ నెల 4న నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంలో 'గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కమిటీ' సభ్యులతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భేటీ కానున్నారని, ఆ మేరకు జిల్లా కేడర్ సిద్ధంగా ఉండాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం ఆయన జిల్లా ముఖ్య నేతలతో గాంధీభవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు పాల్గొనే ఈ బహిరంగ సభను జిల్లా కేడర్ సీరియస్‌గా తీసుకోవాలని, భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి కేడర్‌ను సభకు భారీగా తరలించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజ్య సభ సభ్యుడు అనిల్‌కుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, చైర్మన్ ఫహీం ఖురేషి, చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జి ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, చేవెళ్ల పార్టీ ఇన్‌చార్జి భీం భరత్, పీసీసీ ఉపాధ్యక్షుడు వేణు గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, తదితరులు పాల్గొన్నారు. కీలకమైన ఈ సమావేశానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆయన సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సాగును పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కేశంపేట: తక్కువ నీటి సాంద్రతతో అధిక దిగుబడులు వచ్చే ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్ సూచించారు. మండల పరిధిలోని వేములనర్వ శివారులో సాగవుతున్న ఆయిల్‌పామ్‌ను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, రైతులు పండించిన పంటను ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేశారు. రైతు గుర్తింపు కార్డుల నమోదుపై ఏఈఓలతో రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శిరీష, హెచ్ఓ హిమబిందు, ఏఈఓలు వినయ్, రాజేశ్వరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీని రక్షించుకుంటాం

- కార్మికులను గుండెల్లో పెట్టుకుంటాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



విశ్రాంత కార్మిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హయత్‌నగర్: ఆర్టీసీని రక్షించుకుంటామని, సంస్థను లాభాల్లోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని మునుగనూరులో మంగళవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదవాడికి రవాణా సౌకర్యం కల్పించేది ఆర్టీసీ బస్సు మాత్రమేనని అలాంటి బస్సులను నడిపి సేవలు అందిస్తున్న కార్మికులను గుండెల్లో పెట్టుకుంటామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త బస్సులు కొంటున్నామని, పీఆర్సీ ఇచ్చామని, కారుణ్య నియమకాలు చేపట్టామని, కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఆర్టీసీ పురోగమిస్తోందని అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పును మిగిల్చిన గత ప్రభుత్వం ఆర్టీసీని దివాలా తీయించిందని విమర్శించారు. కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి వారికి అండగా ఉంటామన్నారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు విశ్రాంత కార్మికుల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, విశ్రాంత కార్మిక సంఘం అధ్యక్షుడు రాజయ్య, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి చేపలు

- తలకొండపల్లి తహసీల్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ దాడులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్, అటెండర్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన తహసీల్దార్ నాగార్జున, అటెండర్ యాదగిరి

ఆమనగల్లు: ఏసీబీ అధికారులు నిత్యం దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా అవినీతి అధికారులు మాత్రం లంచం తీసుకోవడం మానడం లేదు. మంగళవారం ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ తహసీల్దార్, అటెండర్ ఏసీబీకి పట్టుపడ్డారు. వివరాలు.. తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన ఓ రైతు తన తల్లిపేరిట ఉన్న 22 గుంటల భూమిని తనతోపాటు తన సోదరుల పేరిట మార్చాలని తహసీల్దార్‌ను ఆశ్రయించాడు. ఇందుకు అక్కడి అధికారులు రూ.50 వేలు డిమాండ్ చేశారు. దీంతో సదరు రైతు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు రైతు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రూ.10 వేలు ఇస్తుండగా తహసీల్దార్ నాగార్జున, అటెండర్ యాదగిరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

టపాసులు కాల్చి రైతుల సంబురాలు

తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంపై ఇటీవల అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో ఏ చిన్నపని కావాలన్నా ముడుపులు ఇవ్వాల్సిందే అని పలువురు ఆరోపించారు. తహసీల్దార్ నాగార్జున లంచటం తీసుకుంటూ అధికారులకు చిక్కడంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.

మహేశ్వరంలో 'మలబార్ గోల్డ్ అండ్ డైమండ్'

- రూ.750 కోట్ల పెట్టుబడితో అతి పెద్ద ఆభరణాల తయారీ పరిశ్రమ
- రేపు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రారంభోత్సవానికి సిద్ధమైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమ

మహేశ్వరం: మండల పరిధిలోని కేసీ తండా ఎలక్ట్రానిక్ పార్కులో మరో భారీ పరిశ్రమ రూపుదిద్దుకుంది. సుమారు రూ.750 కోట్ల నిధులతో 3.7 ఎకరాల విస్తీర్ణంలో 2.3లక్షల చదరపు అడుగుల్లో నిర్మించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమ ఆవిష్కరణకు తుది ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పరిశ్రమను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు యాజమాన్యం యోచిస్తోంది. ఈ కంపెనీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

700 మంది స్థానికులకు ఉపాధి

ఇక్కడ పూర్తి స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, డిజైనింగ్ స్టూడియో, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యూనిట్‌లో ఆటోమేటెడ్ గిడ్డంగి సౌకర్యం ఉంది. కంపెనీలో 33 శాతం గ్రీనరీని ఏర్పాటు చేశారు. ఏడాదికి సుమారు పది టన్నుల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల క్యారెట్ల వజ్రాభరణాలు తయారు చేయగల సామర్థ్యం ఈ యూనిట్ సొంతం. ఇటలీ, అమెరికా, జర్మనీ దేశాలకు చెందిన పరిశ్రమ నిపుణుల సహకారంతో సీఎన్‌సీ యంత్రాలు, తాజా సాంకేతికతతో కూడిన గొలుసు తయారీ, లేజర్ కట్ యంత్రాలున్నాయి. సుమారు 700 మంది స్థానికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. 2022లో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ ఈ కంపెనీకి శంకుస్థాపన చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో 14 కంపెనీలున్నాయి. దేశంలో ఎనిమిది చోట్ల మలబార్ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు తదితరులు హాజరు కానున్నారు.

విద్యతోనే అంతరాలు లేని సమాజం



తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన నర్సింహారెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి

మంచాల: విద్య సమాజాభివృద్ధికి తోడ్పాటునిచ్చేలా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న పనులు, బోధన తీరు, ఉపాధ్యాయుల కృషిని తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరుట్లలో ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ప్రజల మధ్య అంతరాలు తొలగాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం, ఉపాధ్యక్షురాలు మంగ, సభ్యులు నాగమణి, ధనమూర్తి, జగన్నాథ్ ఆరుట్ల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ గౌడ్, సుప్రియ, మోహన్ గౌడ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు భాస్కర్, రాజు, ఎం.డీ.జానీ పాష, జంగయ్య, జంగయ్య, మల్లేశ్, పార్వతి, జ్యోతి, ఉపాధ్యాయులు పాపిరెడ్డి, కిషన్ చౌహాన్, శ్రీకాంత్, జహీర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



గేదెల కళేబరాలు

హయత్‌నగర్: గాలి వానకు విద్యుత్ తీగలు తెగిపడి రెండు గేదెలు మృతి చెందిన సంఘటన తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునగనూరులో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. టెలిఫోన్ కాలనీలో తొర్రూరుకు చెందిన మేకం నాగయ్య తన రెండు గేదెలను కట్టేసి ఉంచాడు. మంగళవారం సాయంత్రం వచ్చిన గాలి వానకు దగ్గరలోని విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఒక గేదె తీగలకు తాకి షాక్‌కు గురై కిందపడింది. అది చూసిన మరో గేదె దాని దగ్గరకు వచ్చింది. దీంతో రెండు షాక్‌తో మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షలు నష్టపోయినట్లు రైతు లబోదిబోమంటున్నాడు.

మహిళ బలవన్మరణం

మొయినాబాద్: భర్తతో గొడవపడి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి పోచయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ఆయన భార్య రాణి(35) ఇదే విషయంలో తరచూ భర్తతో గొడవపడుతుండేది. సోమవారం రాత్రి దంపతులిద్దరూ మరో మారు గొడవపడి పోచయ్య ఇంటి నుంచి వెళ్లి తన తల్లి దగ్గర పడుకున్నాడు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య ఎంతకీ తలుపుతీయకపోవడంతో చుట్టుపక్కలవారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా ఆమె చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏడు ఆవులు అపహరణ

కొత్తూరు: గుర్తు తెలియని దుండగులు ఏడు ఆవులను అపహరించుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల గోపయ్యకు చెందిన రెండు ఆవులు, వన్నం లక్ష్మమ్మవి నాలుగు ఆవులు, ఎర్రోళ్ల వెంకటయ్యకు చెందిన ఒక ఆవు అపహరణకు గురయ్యాయి. కాగా బాధిత రైతులు రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి వారి పశువుల పాకల్లో ఆవులను కట్టేసి ఇంటికి వచ్చారు. మరుసటి రోజు ఉదయం పొలాలకు వెళ్లగా ఆవులు కనిపించ లేదు. చుట్టు పక్కల పొలాల్లో వెతకుతున్న సమయంలో ముగ్గురు రైతులు తమ ఆవులు చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు. చోరీకి గురైన ఒక్కో ఆవు ధర సుమారుగా రూ.80 వేలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షాట్‌గన్‌లో కాంస్య పతకం



మునీర్

ఇబ్రహీంపట్నం: ఇన్ ఎయిర్ స్మాల్ బోర్ షాట్‌గన్ పోటీల్లో 50 మీటర్ల ఓపెన్ సైడ్‌లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకును మండలంలోని కప్పపహాడ్ మాజీ ఉపసర్పంచ్ ఎండీ మునీర్ సాధించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని తెలంగాణ షూటింగ్ అకాడమీలో 11వ రాష్ట్ర షూటింగ్ కాంపిటీషన్ ఇన్ ఎయిర్... స్మాల్ బోర్ అండ్ షాట్‌గన్ ఈవెంట్స్‌ను గత నెల 21 నుంచి 30 వరకు నిర్వహించారు. ఇందులో కాంస్య పతకాన్ని మునీర్ సాధించినట్లు తెలిపారు.

ఖర్చుకు వెనుకాడొద్దు

నిధులు మంజూరు బాధ్యత నాది

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ
- సమస్యలు వివరించిన మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి వైద్య సిబ్బంది



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'కోవిడ్ సమయంలో ఆస్పత్రి భవనంపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు పైకప్పు లీకేజీ అవుతోంది. సిటీ స్కాన్ మంజూరైనప్పటికీ.. స్థలాభావ సమస్యతో ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. టెక్నీషియన్లు అందుబాటులో లేరు. రక్తనిధి కేంద్రం లేకపోవడంతో రక్తస్రావంతో బాధపడుతున్న రోగులకు సత్వర సేవలు అందించలేకపోతున్నాం. వైద్యుల నిష్పత్తి మేరకు గదులు లేకపోవడంతో ఔట్ పేషంట్ విభాగానికి వచ్చే రోగులకు సేవలు అందించలేని పరిస్థితి తలెత్తుతోంది'అంటూ మహేశ్వరం మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి (వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి) వైద్య సిబ్బంది కలెక్టర్ నారాయణరెడ్డి ముందు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వైద్యులు, సిబ్బంది చెప్పిన అంశాలను కలెక్టర్ సావధానంగా ఆలకించారు. 'ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించే బాధ్యత నాదీ.. అయితే ఆస్పత్రికి ఆపదలో వచ్చిన నిరుపేద రోగులకు సత్వర, మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత మీదే'అని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆకస్మిక తనిఖీ.. వైద్యసేవలపై ఆరా

మంగళవారం వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఔట్, ఇన్ పేషంట్ విభాగాలు సహా ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు చేస్తున్నారా? మందులు ఇస్తున్నారా? అంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి పడకల సామర్థ్యాన్ని 100 నుంచి 200 పెంచారు కానీ..అనువైన స్థలం లేక అదనపు పడకలను ఏర్పాటు చేయలేకపోతున్నట్లు స్పష్టం చేయగా, ఆస్పత్రి భవనం పై అంతస్తులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డుకు తక్షణమే రిపేర్లు చేసి, రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు ఎంత ఖర్చైనా వెనుకాడొద్దన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీటీస్కాన్ పెట్టండి.. టెక్నీషియన్లను తీసుకోండి

మెడికల్ కాలేజీ నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో సీటీస్కాన్ ఏర్పాటు చేయాల్సి ఉందని, 2024లోనే సీటీస్కాన్ మంజూరైందని, ఆస్పత్రిలో అనువైన స్థలం లేక ఏర్పాటు చేయలేకపోయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రి ఆవరణలోని ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ డిస్పెన్సరీలను పక్కనే ఉన్న వార్డు ఆఫీసుకు తరలించి, ఆ ఖాళీ ప్రదేశంలో సీటీస్కాన్ ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. రక్తనిధి కేంద్రం ఏర్పాటు సహా అవసరమైన టెక్నీషియన్లను ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికను నియమించుకోవాలని ఆదేశించారు. రోగులకు సేవలు అందించే విషయంలో రాజీపడొద్దన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యలోపం, తాగునీటి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, అదనపు డీఎండీ డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రివేణి, వైస్ ప్రిన్సిపాల్ తఖీయుద్దీన్, ఆర్‌ఎంఓలు జయమాల, రాజ్‌కుమార్, వైద్య మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజనీర్ దేవేందర్, ఈఈ అజీజ్, ఇబ్రహీంపట్నం ఆర్‌డీఓ అనంతరెడ్డి, ఎల్బీ నగర్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య తదితరులు ఉన్నారు.

గడువులోగా పరిష్కరించాలి

భూ భారతి దరఖాస్తులపై కలెక్టర్ ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూభారతి దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుంచి మంగళవారం భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, నజరి నక్షా తయారీ, బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహణపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం అమలులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో వచ్చిన 22,096 దరఖాస్తుల్లో 21,718 ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల నమోదులో సాంకేతిక లోపాలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 10 వరకు పరిష్కరించాలని ఆదేశించారు.

అదనపు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో 1,200 మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే అదనపు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, కొత్త పోలింగ్ స్టేషన్లలకు బీఎల్‌ఓలను నియమించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని శిక్షణా కార్యక్రమాలను ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించాలని, అందుకు మాస్టర్ ట్రైనర్లను నియమించుకోవాలన్నారు. జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలో నజరీనక్షాకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల సరిహద్దుల్లోకి వచ్చే అన్ని కుటుంబాలు, ప్రతి ఇంట్లోని ఓటర్ల సంఖ్యపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా జిల్లా జట్టు

ట్రోఫీ అందజేసిన సీపీ సాయి చైతన్య



విజేతగా నిలిచిన జిల్లా జట్టు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో నాలుగు రోజులుగా సాగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. పోటీల్లో విజేతగా రంగారెడ్డి జిల్లా జట్టు నిలువగా, రన్నర్‌గా నిజామాబాద్ జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎల్లమ్మ కల్యాణం.. ఉప్పొంగిన భక్తిభావం



అమ్మవారి తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

అమీర్‌పేట: డప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు.. ఎల్లమ్మ నామస్మరణలు మార్మోగాయి. ఆలయ పుర వీధులు పసుపుమయంగా మారాయి. మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఉదయం 4 గంటలకు అభిషేక పూజలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. ఉత్తరా నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య 11.51 గంటలకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నామని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

కల్యాణాన్ని తిలకించిన ప్రముఖులు..

అమ్మవారి కల్యాణ మహోత్సవానికి పలువురు ప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, మల్లారెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కలెక్టర్ దాసరి హరిచందన, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీజీ సౌమ్య మిశ్రా, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఈట మహేందర్ గౌడ్, చైర్మన్ సాయిబాబా గౌడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, జోగిని శ్యామల, కోట నీలిమ, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు



ముఖేశ్ మృతదేహం

రాజేంద్రనగర్: అదృశ్యమై యువకుడు హిమాయత్‌సాగర్‌లో శవమై తేలిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హిమాయత్‌సాగర్‌కు చెందిన ముఖేశ్ (35) జులాయిగా తిరుగుతున్నాడు. గతంలో వివాహం జరిగినా అతను మద్యానికి బానిస కావడం, చిల్లర దొంగతనం చేస్తుండటంతో భార్య అతడి నుంచి దూరంగా ఉంటోంది. గత నెలలో అతను కిస్మత్‌పూర్ ప్రాంతంలోని ఓ ఆన్‌లైన్ క్యాష్ సెంటర్ నుంచి నగదు తీసుకుని పరారయ్యాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయిన ముఖేశ్ మంగళవారం హిమాయత్‌సాగర్‌లో శవమై తేలాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



రామాలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



దుండగుడు విగ్రహాలను మోసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాలో కనిపించిన దృశ్యం

పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఇబ్రహీంపట్నం: డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో రెండు ఆలయాల్లో విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని పోలకంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని రామాలయంలో సీతారామలక్ష్మణ స్వాముల వారి పంచలోహ విగ్రహాలు, గంగాదేవి ఆలయంలో పెద్దమ్మ తల్లి, గంగాదేవి విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. రామాలయంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా ఓ దొంగ విగ్రహాన్ని సంచిలో పెట్టుకుని వెళ్తున్నట్లు గుర్తించారు. అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

సిగ్గుపడాల్సింది పోయి దాడులు చేస్తారా



కళాశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై బీఆర్‌ఎస్ నాయకులు సిగ్గు పడాల్సిందిపోయి దాడులు చేస్తామని మాట్లాడడం సిగ్గుచేటని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన కన్హశాంతి వనంకు వెళ్తున్న ఆయనకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారు ఎవరైనా ప్రభుత్వం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం ఆయన జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల నిర్మాణం ఓ మహత్తర కార్యక్రమని ఎమ్మెల్యే గొప్ప ఆశయంతో ముందుకు సాగుతున్నారని శభాష్ శంకర్ అంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాయక్, ఎండీ.ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బస్వం, మోహన్, ముబారక్‌అలీ, మురళీమోహన్, సీతారాం, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.